సజీవశిల్పం

రంగధామ



మూడవబహుమతి
పొందిన కథ

ప్రేమకు ముసలితనం లేదు. అది యౌవ్వనంలో ఎంత ఉధృతంగా వుంటుందో వయసు పెరిగిన కొద్దీ అంత గాంఢంగా గంభీరంగా పరిణమిస్తుంది.

అందుకు నిదర్శనం రామనాథమేనూ !

''అడుగోనోయ్ ! మన వృద్ధ రోమియో !'' అన్నాడు ధనరాజ్ తన స్నేహితులతో, మెయిలు రాగానే తమలాగే పెట్టెలలోని ప్రయాణీకుల్ని పరిశీలిస్తూ నడుస్తున్న రామనాథాన్ని చూసి. అతని మిత్రులు కూడా అటు చూశారు.

''నిజమేనోయ్, ఇంకా అమ్మాయిల్ని ఆకర్షిద్దామనే ఆశ, పాపం ! మొన్న ఒక అమ్మాయి ఈయన్ని చూసి 'తాతగారూ ! మంచినీళ్లెక్కడ దొరుకుతాయి ?' అని అడిగింది. అయినా సిగ్గు లేదు.'' అని సూర్యం అన్నాడు. ఆ యువకులు మెయిలు పెట్టెలలోని ప్రయాణీకుల్ని విమర్శగా చూస్తూ అటూ ఇటూ నడుస్తూ జోకులు విసుర్తున్నారు.

అతని వయస్సు ఏభై ఆరు. తెల్లని పంచెమీద తెల్ల చొక్కా, నల్లని కోటూ వేసుకుని, పచ్చని శరీరచ్ఛాయతో బక్కపల్చగా ఉండే వ్యక్తి. బంగారు ప్రేము కళ్లజోడుతో అతని మొహం ప్రశాంతంగా ఉంటుంది.

రోజూ సాయంకాలం ఆరింటికి రామవరం రైలు స్టేషనుకు విధిగా హాజరవుతాడు. మెయిలు వచ్చాక పెట్టెలన్నీ వెదుకుతాడు. రైల్లో వస్తానని రాసిన ఆప్తు లెవరో రైలులో రాకపోతే ఎంత బాధ పడ్తాడో అంత బాధపడి చివరకు రైలు వెళ్లిపోయాక నిస్పృహతో ప్లాటుఫారంమీద ఒక సిమెంటు బెంచీ మీద కూలబడి ఆలోచిస్తూండేవాడు.

సుమారు రెండు నెలల నుంచి ఇది అతని దిన చర్యలో ముఖ్యమైన భాగమైపోయింది. అందుకు కారణం ఒక ఉత్తరం !

అది శారద దగ్గర్నుంచి వచ్చింది. తను రామవరం వస్తున్నాననీ, మెయిలు వద్దకు వచ్చి తనను కలుసుకోమనీ రాసింది. ఆ ఉత్తరం వచ్చిన దగ్గర్నుంచీ అతనిలో ఆమెను కలుసుకోవాలనే ఆతృత పెరిగిపోయింది. ఆనాటినుండి రోజూ మెయిలుకు రావటం మొదలెట్టాడు. ఆ లేఖ అతని హృదయాన్ని పులకింపజేసింది. ముప్ఫై ఏళ్ల వయసుని మాయంచేసి అతన్ని గతం లోకి, అంటే ఇరవై ఆరేళ్ల ప్రాయంలోకి తీసుకుపోయింది. శారద హృదయం అతనిముందు విప్పిచెప్పుకుంటున్నట్లూ, తను ఆమెను పరిగ్రహిస్తున్నట్లూ వూహింపజేసింది. అతని మనసులో, ప్రతి క్షణం అతనిలో ఆమె తలంపే రేపింది.

ఈ వయసులో మళ్లీ అతనిలో ఒక కొత్త ఆవేశం కలిగింది. ఈసారి ఏమైనా సరే శారదను విడిచి ఉండ కూడదనే నిర్ణయానికి వచ్చాడు. మునుపు తను ఇద్దరికీ అనుభవంలేని ఉద్రేకం, ఏది మంచో ఏది చెడో తెలియని మనసులు తమవి. పెద్దవాళ్ల మాట వింటే ఏదో ఒరిగిపడుతుందన్న భ్రాంతిలో పడ్డ రోజులు. ఇన్నేళ్ల అనుభవంతో అందులోని సత్యం తనకు తెలిసింది. పెద్దవాళ్లు గెలిచారు. తనలోని అశాంతి మిగిలిపోయింది.

తను శారద గురించి ఆలోచిస్తున్నట్లే, శారద కూడా తన గురించి ఆలోచిస్తోందా లేదా ? అన్న ప్రశ్న చాలాకాలం అతనిని బాధిస్తూండేది. ఆ ప్రశ్నకు సమాధానంలా ఆ ఉత్తరం వచ్చింది. తనని కలియడం కోసం ఆమె ఎంతో తహతహలాడుతూండడంబట్టే ఆవిధంగా రాసింది. ఈసారి, ఎవరేమనుకున్నా సరే తనూ, శారదా కలిసి, శేష జీవితం గడపాలి. అసలు ప్రస్తుతం తను ఒంటరి ఉంటున్నాడు; అందుకని శారదను ఆహ్వానించడానికి ఎంతమాత్రం అభ్యంతరంలేదు.

అసలు తను ఒకరి గురించి ఎందుకు భయపడాలి. ఇన్నాళ్లూ తను ఆమెను కలుసుకోక పోవడం ఇతరు లేమనుకుంటారో ? అనే కదూ? అది ఎంత వ్యర్థపు ఆలోచనో ఇన్నాళ్లకు తెలిసి వచ్చింది. ఆనాడే, తను తన తల్లిని ఎదురించి శారదను వివాహం చేసుకుని ఉంటే, తన జీవితగతే మరోకవిధంగా మారిపోయి ఉండేది. తన జీవితానికి దూరంగా ఉన్నా, శారద తలపే తన కానందం ఇచ్చేది, ఆమె సాన్నిహిత్యం ఎంత మాధుర్యంగా ఉంటుందో !

కొన్నాళ్ల క్రిందటి వరకూ అప్పుడప్పుడు, తను శారదను పూర్తిగా మర్చిపోయా ననుకున్నాడు. కాని, ఇప్పుడు తెలుస్తోంది.... ఆమె తన కెప్పటికీ మరుపురాదని. అసలు తన మనసులో భవిష్యత్తులో ఎప్పుడో ఆమెను కలుసుకోగలుగుతాననే ఆశతోనే జీవితం ఇన్నాళ్లూ గడిపాడు.

శారద ఆవూరి కరణంగారి అమ్మాయి. పద్దెనిమిదేళ్ల మిసమిసలాడే యౌవనంలో ఆమె నవ్వితే మల్లెపూలు కుప్ప పోసినట్లుండేది. పొడుగైన ఆమె కళ్లలోంచి చూపులు ఆదారంట వెళ్లేవాళ్ల కాళ్లకు మెత్తని బంధాలు తగిలించినట్లుండేవి.

రామనాథం స్కూళ్ల ఇన్స్పెక్టరుగా ఉద్యోగం చేస్తూ ఆ వూరు బదిలీ అయి వచ్చాడు. అప్పటి కతను పాతికేళ్ల బ్రహ్మచారి. అతని తల్లితో సహా కరణంగారి ఇంటి కెదురింట్లో దిగాడు. రామవరంలో రెండేళ్లున్నాడు. తరువాత అతనికా వూరు నుంచి బదిలీ అయిపోయింది. అతను ఆ రెండేళ్ల లోనూ శారదను గాఢంగా ప్రేమించాడు. ఏమైనా సరే ఆమెను వివాహం చేసుకుందా మనుకున్నాడు. కాని, అతని తల్లి ఒప్పుకోలేదు.

ఆమెను రహస్యంగా చాలాసార్లు కలుసుకుని తను ఆమెను ప్రేమిస్తున్నానని చెప్పాడు. తనని వివాహం చేసుకుంటాడేమో ననుకుంది శారద. కాని, ఆ విషయంలో అతని తల్లి ఒప్పుకోవటంలేదని తెలుసుకున్నాక కరణంగారు శారదకోసం వేరే సంబంధాలు వెతకనారంభించారు. చాలా సార్లు తల్లిని ఎదురిద్దా మనుకున్నాడు గాని రామనాథం, ఆమె కంట నీరు పెట్టుకుని తన తమ్ముడి కూతుర్ని చేసుకోవాలని పట్టుబట్టడం వలన అతను శారదను వివాహం చేసుకోలేక పోయాడు.

అతను ఆ వూళ్లో ఉంటూండగానే శారదకు వివాహమైపోయింది. ఆమె అత్తవారింటికి వెళ్లిపోయింది. తను ఆ వూరునుండి మరో వూరు వెళ్లిపోయాడు. ఆమెను మాత్రం మర్చిపోలేక పోయాడు.

ఆమెను మళ్లీ మళ్లీ కలుసుకోవాలని తను చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. కాని ఆమె గురించి వివరాలు మాత్రం ఎప్పటికప్పుడు తను తెలుసుకుంటూనే ఉన్నాడు. ఆమెకు వివాహమైన పదేళ్ల తరువాత ఆమె భర్త చనిపోయాడు. ఆమె జీవనాధారం కోసం ఉద్యోగంలో చేరింది. రామవరంలో ఇల్లుంది కాబట్టి తరుచూ రామవరం వస్తూండేది.

తనకు శారద విషయాలు చెప్తున్నవాళ్లే, శారదకు కూడా తన విషయాలు తెలియజేస్తున్నారని రామనాథానికి తెలిసింది. శారద పినతండ్రి సత్యనారాయణ, అతని ఆఫీసులో గుమాస్తాగా పని చేసేవాడు. అతని ద్వారా తనకి శారద గురించి వివరాలు తెలిసేవి. అతనే రామనాథం గురించి శారదకు కూడా తెలియజేస్తుండేవాడు.

ఉద్యోగ జీవితమంతా రామనాథానికి హాయిగా వెళ్లిపోయింది. ప్రమోషన్లు సకాలంలో లభించడంవలన త్వరగానే డి. ఇ. ఓ. అవడం జరిగింది. భార్యా బిడ్డల విషయంలో కూడా ఏ లోటూ లేదతనికి. అనుకూలవతి అయిన భార్యా, బుద్ధిమంతులైన ముగ్గురు మగపిల్లలూ అతనికి ఏనాడూ కొంచెం కూడా చికాకు కల్పించకుండా మసలుకునేవారు. కాని, జీవితంలో అతనికి చాలా వెలితి కనిపించింది.

ఆ వెలితి అప్పుడప్పుడూ శారద రూపంలో జ్ఞాపక మొచ్చేది.

జీవితంలో ప్రేమించనే కూడదు గాని, ప్రేమించిన తరువాత అది ఫలించకపోతే జీవితం అంతా నరకప్రాయంగా గడుస్తుందని రామనాథం అనుకునేవాడు. తన భార్యను ప్రేమించలేకపోయాడు. ఉద్యోగం, హోదా, సంపదా అన్నీ అనుభవిస్తున్న అతన్ని చూసినవారందరూ అతని జీవితం వడ్డించిన విస్తరి అనుకుంటుండేవారు. కాని, అతనికి ఆ జీవితం నిస్సారంగా కన్పించేది. ఎప్పుడైనా, ఇవన్నీ వదిలేసి తను ప్రేమించిన వ్యక్తి దగ్గరకు పారిపోదామనిపించేది.

అనేకసార్లు ఈ ఆలోచన వచ్చినప్పటికీ, దాని నాచరణలో పెట్టలేక పోయాడు రామనాథం. ఏవో బాధ్యతలు నెత్తి మీద పడి అతన్ని ఆ పని చెయ్యనీయకుండా చేసేవి. ఒక్కొక్కప్పుడు తను ఇతరులను సంతృప్తి పరచడం కోసం, తన సుఖాన్ని చేతులారా పాడుచేసుకుంటున్నా ననుకునే వాడు.

శారద భర్త చని పోయాడని తెలిసినప్పుడు, ఆమెను వెళ్లి చూడాలని విశ్వ ప్రయత్నం చేశాడు. కానీ అదే సమయంలో తన భార్యకు జబ్బు చేయటం వలన, ఆమెను ఆస్పత్రిలో చేర్పించవలసి రావడం వలనా, ఎక్కడికీ కదల లేక పోయాడు. తను ఎంత బాధ పడిందీ సత్యనారాయణకు చెప్తే, అతను శారదకు ఉత్తరం ద్వారా తెలియ జేశాడు.

ఆ తరువాత శారద ట్రైనింగు పాసయి టీచరు ఉద్యోగంలో చేరిందని తెలిసింది. తను, డి. ఇ. ఓ.గా చేసిన ఇన్నేళ్ల సర్వీసులోనూ ఆమె

ని చేస్తున్న జిల్లా తప్ప, తక్కిన జిల్లాలన్నీ తిరిగాడు. అందుకని ప్రతీసారీ, ఆ జిల్లాకు ట్రాన్స్ఫరు అవుతుందనీ, ఆమెను కలుసుకో వచ్చునని ఆశ పడడం తీరా ఆర్డర్స్ మరో జిల్లాకు రావటంతో, ఆ ఆశ నిరాశ కావటం జరుగుతూ కాలం గడిచి పోయింది.

తను రిటైరయ్యే దాకా కూడా, సత్యన్నారాయణ ద్వారా శారద విషయాలు తనకు తెలుస్తూనే ఉన్నాయి. అంతే కాక తను రిటైరై రామవరంలో ఇల్లు కట్టుకోవడం, అక్కడే స్థిర పడ దల్చు కున్నట్లూ సత్యన్నారాయణ ఆమెకు తెలియ బర్చాడు. అప్పుడే తను రామవరం వచ్చి పది నెల లయింది. కుటుంబం విశాఖపట్నంలో పెద్దవాడి దగ్గర ఉన్నారు. తను ఒంటరిగా ఉంటున్నాడు.

ఆమె కోసం తను వచ్చినప్పటి నుండీ ఎదురు చూస్తున్నాడు. తన ఆశకు బలంగా, ఒక నాడు ఉత్తరం వచ్చింది. అందులో రెండే ముక్కలు రాసున్నాయి. 'మెయిలుకు వస్తున్నాను. స్టేషను దగ్గర కలుసుకోండి'— శారద.

ఆ ఉత్తరం వచ్చిన దగ్గర్నుంచీ అతను ప్రతి రోజూ విధిగా రైలు ఫ్లాటుఫారము మీదకి, మెయిలు ఇంకొక గంటకు వస్తుందనగా వచ్చి, మెయిలు వెళ్లిపోయిన మరొక గంట దాకా ఉండి వెళ్లి పోయే వాడు. ఈ సమయంలో అతను ఎంతో ఉద్రిక్తతను పొందేవాడు. ఆమె కోసం ఎదురు చూడ టంలో ఎంత హాయి ఉంటుందో గ్రహించాడు.

అసలు తన ప్రేమ కథను ఎవరితోనైనా చెప్పు కుని తన ఆనందాన్ని పంచుకోవాలనిపిస్తూండేది అతనికి ఒకొక్కప్పుడు. ఆ మెయిలుకు అతని లాగే విధిగా రోజూ కొందరు యువకులు కూడా వచ్చే వారు. వాళ్లకు అదొక కాలక్షేపం మెయిలు రాగానే, అన్ని పెట్టెలలోని వ్యక్తుల్నీ పరిశీలించడం వాళ్ల

సజీవ శిల్పం

కొక పరదా. కాస్త అందంగా కన్పించే అమ్మాయిల వైపు ఆశగా చూడటం, తమలో తాము ఏవేవో చెప్పుకుని వెకిలిగా నవ్వటం, ఏవో జోక్సు విసురు కోవటం, ఒకొక్కప్పుడు పరుగు లెత్తటం లాటి కుర్ర తనపు చేష్టలెన్నో చేసేవారు.

మెయిలు వెళ్లాక వాళ్లు కూడా ఒక సిమెంటు బెంచీ మీద చేరేవారు. వాళ్లు ముగ్గురూ పాతికేళ్ల లోపు వాళ్లు. అందులో ఒకతను తన ప్రేమ గురించి తక్కిన వాళ్లతో చెప్తూండే వాడు. వాళ్లు కూచునే బెంచీ, రామనాథానికి దగ్గరలోనే ఉండేది. అందుకని వాళ్ల మాటలు అతనికి విన్పిస్తూ ఉండేవి.

యువకుడి పేరు ధనరాజ్. "ఇవాళ మనం ఇచ్చిన పూలు ఎంతో ఆప్యాయంగా పెట్టుకుందోయ్" అన్నాడు.

"మాకు తెలుసయ్యా, ఆ అమ్మాయి అలాటి పని చేస్తుందని. నువ్వు చేసిన పనికి, పూల ఖర్చు రోజూ జుల్మానా వేసిందన్న మాట. నువ్వు జాగ్రత్తగా ఉండాలి." అన్నాడు సూర్యారావు.

"ఇహ వాళ్ల నాన్న నడిగేస్తాను, వాళ్లమ్మాయి నాకిచ్చి పెళ్లి చెయ్యమని."

"అయితే నీకు యావజ్జీవిత ఖైదు తప్పదు"

"ఎక్కడ ?"

"ఆమె చేతుల్లో."

"ఎంత మధురమైన శిక్ష !"

అంత వరకూ మౌనంగా ఉన్న, సుబ్బారావు. "చూడు బ్రదర్ ! ఆ చేసేదేదో తొందరగా చెయ్యి" అన్నాడు.

"ఏం ?"

"మనవాడు కొద్దిగా కవిత్వం వ్రాస్తాడు. ఎవడో ఒక కవి రాశాడు. నువ్వెక్కవలసిన రైలు ఒక జీవితం లేటు — అని. అందుకని అలా కాకుండా...." అని సూర్యారావు అనగానే ముగ్గురూ నవ్వారు.

తను కూడా మానసికంగా వాళ్ల మాటల్లో పాల్గొనే వాడు రామనాథం. వాళ్లు ఆ చిన్న విషయాలకు అంత ఉద్రేక పడిపోవడంలో ప్రేమ యొక్క ప్రభావం విస్పష్టంగా కన్పించేది రామ నాథానికి. వాళ్లు కాస్సేపు మాట్లాడుకుని వెళ్లి పోతూంటే తను ఒంటరితనం అనుభవించేవాడు. వాళ్లతో తనూ కలిసి మాట్లాడాలని పించేది— ప్రేమ గురించి. కాని సిగ్గేసేది.

ఒంటరిగా కూర్చుని పాత దృశ్యాలను గుర్తుకు తెచ్చుకునే వాడు. తన కొకసారి జ్వరం వచ్చి మూడు రోజులు కదలకుండా పడుకున్నాడు. అప్పుడు శారద ఎన్నోసార్లు వచ్చి, తన తల్లిని, తనకెలా ఉందో అడిగింది. చివరికి మూడో రోజు సాయంకాలం తిన్నగా తన గదిలోకే వచ్చేసింది. తను కళ్లు మూసు కుని పడుకుంటే, నుదురు మీద చెయ్యేసింది. ఆ స్పర్శలోని సుఖం తను ఇప్పటికీ మర్చిపోలేడు. అప్పుడామె కళ్లల్లోని జాలి, తన మనస్సు లోతుల నాక్రమించుకుంది.

స్త్రీని అర్థం చేసుకోవడం ఎంత కష్టమో ఇంత కాలానికి తను తెలుసుకో గలిగాడు. ఆమె హృదయం యొక్క అగాధమైన లోతుల్లో అణగారి పోయే అవ్యక్త భావాల్ని గ్రహించడానికి పురుషుడికి ఒక జీవితమంతా కూడా చాలదనిపించింది.

ఏదో చెప్పాలనే ఆమె చూపులలోని భావం గురించి తనెన్నడూ ఆలోచించలేదు. అది ఆమె ప్రేమను వ్యక్త పరిచే భాష అని తను ఇప్పుడు గుర్తిస్తున్నాడు. తను ఎప్పుడూ ఉద్రేకంతో, ఆమె కావాలనుకునేవాడు. ఆమెను పొందలేక పోయా ననే విరక్తితో ఆమెను మర్చిపోదామని ప్రయత్నిం చాడు కాని ఆమె అత్తవారింటికి వెళ్లిపోతూ తన తల్లి వద్దకు వచ్చి మెల్లిగా సెలవు తీసుకుంటూ తన వైపు ఒకసారి చూసిన చూపు గుండెల్లో ఇప్పటికీ ఆక్రోశిస్తూనే వుంది.

మళ్లీ ఇప్పుడు ఆమెను కలుసుకో బోవడం భగవన్నిర్ణయంలా కనిపిస్తోంది. తనలోని వ్యక్తిత్వం పరిణామం పొందటానికి తన వయస్సు దోహద మిచ్చింది. చిన్న తనంలో తను ప్రపంచాన్ని మసక వెలుతురులో చూసేవాడు. రంగుటద్దాలతో వ్యక్తుల్ని పరిశీలించేవాడు. అప్పటికి ఇప్పటికీ తన దృక్పథంలో ఎంతో తేడా వుంది. ఇప్పుడు ప్రతి వ్యక్తిలోని మంచిని చూడ గల్గుతున్నాడు.

*　　*　　*

సాయంకాలం ఏడు గంటలకు రావలసిన మెయిలు గంటన్నర లేటుగా వచ్చింది. ప్లాటుఫారం మీదికి మెయిలు వచ్చి ఆగగానే, ఒక్కసారి ప్రయాణీకులు హడావిడిగా ఇటూ అటూ తిరగ నారంభించారు.

ఎక్కేవాళ్లు దిగేవాళ్లను తోసుకుంటూ ఎక్కు తున్నారు. దిగేవాళ్లు సామాన్లీ, జనాన్ని తప్పించుకుని లాఘవంగా దిగుతున్నారు. ఆడవాళ్ల కంపార్టు మెంటు లోంచి ఒక ఏభై ఏళ్ల స్త్రీ దిగింది. ఒక పెట్టె బెడ్డింగుతో సహా. ఆమె తలంతా నెరిసి పోవడమే కాకుండా మొహం మీద స్ఫోటకం మచ్చ



'మరోలా భావించక! మా బంధువుల అబ్బాయిదికూడా ఇదే మోస్తరు ఫాషన్! వాడు ఔనో... కాదో అని చూశా...'

ంతో, సన్నగా జబ్బు దానిలా వుంది. కొన్ని వళ్ళ కూడా రాడినట్లు కనిపిస్తున్నాయి. మొహం మీద బొట్టు లేక పోవడం వల్ల ఆమె విధవ అని తెలుస్తోంది. ఆమె కూలీ కోసం అయిదు నిమిషాలు ప్లాటుఫారం మీద నిలబడింది.

రామనాధంగారు వోపికగా అన్ని కంపార్టుమెంటులూ తనిఖీ చేశారు. ఆమె దిగిన కంపార్టుమెంటు వద్దకు కూడా వచ్చి, ఆమెను చూచి, ఆమె కాక మరెవరైనా దిగుతారేమో చూచి, మరెవరూ దిగక పోవడం వలన, నిరాశతో ముందుకు వెళ్లి పోయారు. తరువాత అటు వైపు రెండుసార్లు తిరిగారు. గాని ఆమె వైపు మళ్లీ చూడలేదు.

ఆమె మాత్రం ఆయన్ని గుర్తించింది. కాని అక్కడ పలకరించడం బాగుండదని వూరుకుంది. మెయిలు వెళ్లి పోగానే ఒక రైపెన్సు కూలీని పిల్చి కరణం గారింటికి పదమంది. ఆమె స్టేషను నుంచి వెళ్లిపోతూ ఆఖరు సారి రామనాధం వైపు చూసి, తనను అతను గుర్తించలేదని నిశ్చయం చేసుకుంది.

— శారద !

మామూలుగా రోజూ లాగే ఆయన సిమెంటు బెంచీ మీద కూర్చుని, శారద రైల్లో దిగనందున విచారిస్తున్నారు రామనాధంగారు. తను ముప్ఫై ఏళ్ల క్రిందట చూసిన సౌందర్య రాసి — శారద రూపం — అలాగే వుంటుందని భావించారాయన. అది ఒక అద్భుతమైన శిల్పి శిలలో మలచిన సౌందర్యమై, నిర్జీవ ప్రతిమగా వుండి వుంటే, ఎన్ని సంవత్సరాలకైనా మారకుండా వుండేదేమో !

సృష్టి కర్త, చైతన్యంతో నింపిన, సజీవశిల్పమైన మానవ రూపం మీద, కాలం ఎన్ని మార్పుల్ని తెస్తుందో, రామనాధంగారి వూహకంద రానిది. అందుకే ఆయన శారదనుగుర్తించ లేకపోయాడు. ఇన్నేళ్ల తరువాత !

ఆ రాత్రి కూడా ఆయనకు తియ్యని కలలు వచ్చాయి. శారదా తనూ ప్రేమ లోకంలో విహరిస్తున్నట్లు, ఆమె పసిడి బుగ్గలూ, తళుకు కన్నులూ తనను మైమరపించినట్లూ దృశ్యాలు కన్పించాయి. అదే సమయంలో కరణంగారింట్లో శారద తన చెల్లెలితో కబుర్లు చెపుతూ, "రామనాధంగారిలో బాగా ముసలి వాలకం వచ్చేసింది సుమా !" అని అంటోందని ఆయనికి తెలియదు.

మర్నాడు ప్రొద్దున్న రామనాధం గారు స్నానం చేసి హాల్లో కూర్చుని శారద గురించి తీవ్రంగా ఆలోచించ సాగారు. రెండు నెలల క్రిందట వస్తానని రాసిన ఆమె ఇంత వరకూ రాక పోవడానికి కారణమేమిటో తెలుసు కోవాలని నిశ్చయించారు. ఆమెకు ఏదైనా ఆపద సంభవించిందేమోనని శంకించారు. అదేమిటో తెలుసుకునేదాకా ఆయనకు తోచదు. సత్యన్నారాయణ పేర ఒక ఉత్తరం రాయ దల్చారు.

ఒక కవరు తీసి దానిపై సత్యనారాయణ అడ్రసు వ్రాశారు. ఉత్తరం ప్రారంభించారు. రెండు నెలల క్రిందట శారద తన కొక వుత్తరం రాసిందని వ్రాస్తూ, ఆమె వుత్తరం లోని అంశాలు వ్రాయడం మొదలెట్టారు.

ఇంతలో "సార్ !" అని కేక వేసుకుంటూ పోస్టుమాను వచ్చాడు. తన చేతికి ఒక కార్డు ఇచ్చాడు. తీరా అది చదివే సరికి తనది కాదా వుత్తరం వెంటనే పోస్టుమాన్‌ను వెనకకు పిల్చి, "పేరు నా దానిలా వుంది గాని ఉత్తరం నాది కాదు." అని చెప్పి ఇచ్చేశారు.

సజీవ శిల్పం

"ఓహో ! అయితే ఆ ఎదురింటాయనకాబోలు సార్ !" అని ఆ ఉత్తరం తీసికెళ్లి ఆయకిచ్చాడు. ఆయన కూడా వీధిలో నిలబడి వుండి ఇది చూస్తున్నాడు. పోస్టుమాన్ ఇచ్చిన ఉత్తరం తీసుకున్న తరువాత తన నుద్దేశించి, "మీ పేరూ నా పేరూ ఒకటవడం మూలాన ఉత్తరాలు తారు మారవుతున్నాయి." అన్నారు. రామనాధం గారు చిరునవ్వు నవ్వారు.

"రెండు నెలల క్రితం తను ఈ వూరు వస్తానని స్టేషనుకు వచ్చి కలుసుకోమని నా భార్య రాసిన ఉత్తరం నాకందనే లేదు." అన్నారు ఎదురింటాయన.

రామనాధం గారు గతుక్కుమన్నారు. "ఆమె పేరు ?" అని అడిగారు. ఏదో భయపడుతున్నట్లు.

"శారద." అన్నారాయన అదొకలా చూస్తూ.

"ఓహో !" అంటూ లోపలికి వెళ్లిపోయారు రామనాధం గారు.

కొద్ది నిముషాల తరువాత సత్యన్నారాయణకు రాసే వుత్తరాన్ని చింపేశారాయన. ★

కాల్గేట్‌తో నోటినించి దుర్వాసన రాకుండా చేసుకోండి

రోజంతా దంతక్షయం కాకుండాకూడా కాపాడుకోండి!

ఎందుకంటె: ఒక్కసారి తోముకొంటేనే కాల్గేట్ డెంటల్ క్రీమ్ నోటిలో దుర్వాసన మరియు దంతక్షయమునకు కారణమైన సూక్ష్మ క్రిములను 85% వరకు తొలగించును. కాల్గేట్ 10 మందిలో 7 గురికి నోటి దుర్గంధమును వెంటనే ఆపుతుందని మరియు భోజనము అవగానే కాల్గేట్ పద్ధతిలో పళ్లు తోముకొనుట ద్వారా ఎక్కువ మందికి ఎక్కువ దంతక్షయము అరికట్టిందని దంత శాస్త్ర చరిత్రలో పూర్వము ఎన్నడూ తెలియ చేయనంతలా శాస్త్ర పరిశోధనల ఫలితముగా నిరూపించబడినది. ఊరికే నోటిలో నీళ్లు పోసుకొని పుక్కిలించుట చాలదు. భోజనము అయిన వెంటనే క్రమంతప్పకుండా కాల్గేట్‌తో పళ్లు తోముకోండి. దాని పచేతనమైన నురుగు పళ్ల మధ్య కనపడకుండా ఉండే సందులలోనికి వెళ్లి నోటి దుర్వాసనకు మరియు దంతక్షయమునకు కారణమైన కుళ్లి పోతున్న ఆహారపు తునకలను తీసివేస్తుంది. పిల్లలు కాల్గేట్‌తో పళ్లు తోముకొనుటకు యిష్టపడతారు ఎందుకంటె చాల సేపు ఉండే దాని పెప్పర్‌మెంట్ వంటి రుచి అంటే వారికి ప్రీతి.

మీకు పొడరు కావాలంటే, ఈ లాభములన్నిటినీ మీరు కాల్గేట్ టూత్ పౌడరు ద్వారా పొందగలరు...ఒక డబ్బా నెలలు వస్తుంది.

కాల్గేట్‌తో క్రమం తప్పకుండా పళ్లు తోముకొంటే
- నోటి దుర్వాసనను పోగొట్టును
- దంతక్షయమును నిరోధించును
- పళ్లను మెరుస్తూ ఉండేలా ఉంచును



వారు ఎక్కువ శుభ్రముగా, తాజాగా ఉండుటకు మరియు పళ్లు ఎక్కువ తెల్లగా ఉండుటకు ప్రపంచములో ఏ యితర పళ్లు తోముకొనే క్రీమ్ కన్న కాల్గేట్‌నే ఎక్కువ మంది వాడుతున్నారు.

[illegible]